వుపన్యాసాలు దంచాలని వుబలాట పడేవాడు. "వీరన్న స్వతహాగా ప్రాణాలు తీసేవాడు కనక 'సిద్ధాంతం-సిద్ధాంతం' అని పలవరిస్తాడు. ఇదంతా బురఖా రాయుడి తత్వం!" అని ఎవరో గాని అతడి దగ్గరకె చేరేవారు కాదు. ప్రాణాలు తీసినవారి ప్రాణాలు తీస్తానని తనను అంతా అనుమానిస్తున్నారని, అంటుకోకుండా తిరుగుతున్నారనీ అనుకొన్నాడు. "సరె! ఆ విడుదల రోజు రానివ్వండి!" అని ఓర్మితో కాచుక్కూచున్నాడు.

కొన్ని సంఘటనలు అనుకోకుండా విచిత్రంగా జరుగుతూంటవి. వీరన్న విడుదలా, అనేకమంది రాజకీయనాయకుల విడుదలా ఒకరోజునే సంభవించింది! వీరన్నకి కొత్తబట్టలు యివ్వబడ్డయ్. నాయకులకి స్వాగతమీయడానికి బయట వేలాది జనం మూగారు. తలుపులు తెరవబడ్డాయి. ఆత్రుతతో ఎదురుచూసే మిత్రులు సాగివచ్చే నాయకుల్ని అభినందించి, దండలువేసి 'జిందాబాద్!' కొడుతున్నారు. ఆశ్చర్యం! ఎవ్వరూ ఏమీ తెలియకుండానే వీరన్నకికూడా పికెవంలాగ్గా దండలువేశారు. తను సరిగ్గా చూసుకొనేసరికి వీరన్న పదిమంది భుజాలమీద వున్నాడు. జేజేలు కొడ్తున్నారు.

తరువాత ఉపన్యాసాల్లో వీరన్న సమ్మెకట్టడం అహింసా సిద్ధాంతానికి మహనీయమన్నారు. వీరన్న అమాంతం అందలంలో ఎక్కిపోయాడు.

తమ సర్వస్వం దేశ సౌభాగ్యానికి ధారపోసిన మహాత్యాగుల చిత్రాలతోపాటు గ్యాలరీలో వీరన్న నిలువెత్తు చిత్రం దండలలో అమర్చబడింది. వీరన్న ఇప్పుడొక మహా నాయకుడు. రేపటి మంత్రిపుంగవుడు!

(ముల్క్‌రాజ్ ఆనంద్ ఆధారంగా)

# వికారంలో ఆకారం

యం. హీరాలాల్ రాయ్

గదినిండా అప్సరల బొమ్మలు నింపేసి కూచున్నాడు చంద్రపాల్. ఒకత్తెకు వక్షోజాల మీద బట్టలేదు. మరొకావిడకు 'ఊరుగాఢాంతర సీమల'దాకా ఆచ్ఛాదనలేదు. మరో చిత్రంలో మరో తీరుగావుంది. ఎలావున్నా వాటి ముఖాలు అందంగా మెరుస్తున్నట్టున్నాయి. అంత అందమైన బొమ్మల తాలూకు అసలుమనుషులు ఎవళ్ళో సినిమాతారలు కాని, ఏ ఇంద్రలోకం స్త్రీలో కానేకారు.

చంద్రపాల్ తన వూళ్ళోగల అందమైన స్త్రీల బొమ్మలన్నీ రాసేశాడు. వాడికి బొమ్మలు రాసేశక్తి భగవంతుడిచ్చినందుకు ఏడవాలి! చంద్రపాల్ శరీరం యెంత వికారమో, వాడి హృదయం అంత సుందరం అయినందుకు ఆనందించాలి. ఎవత్తె కనపడితే, ఆవిడ ముఖాన్ని అలా ఆకళింపు చేసేసుకుని. ఫోటోకంటె పదిరెట్లు బాగా బొమ్మ గీస్తాడు చంద్రపాల్. 'చంద్రపాల్' అంటే అందమైన స్త్రీలకు భయం, అనురాగం. తమ బొమ్మగీసి నలుగురికీ చూపి, తమను అల్లరిపాలు చేస్తాడేమోనని ప్రతి అందకత్తె భయపడుతో వుంటుంది. కాని తన బొమ్మ చంద్రపాల్ చే రాయబడితే, తాను ధన్యురాలనైనట్టే అని భావించని స్త్రీ ఆ వూళ్ళో లేదు.

తమను తాము అందగాళ్ళమని భావించుకునే అల్లరి కుర్రవాళ్ళు అందమైన ఆడాళ్ళ వెనకాలే తిరిగి, వాళ్ళ ఆదరాన్ని పొందడానికి ఎంత ప్రయత్నించినా సాధ్యం కావడంలేదు. చంద్రపాల్ మాత్రం సులభంగా, వాళ్ళ ప్రేమని చూడగలుగుతున్నాడు.

చంద్రపాల్ గది ఒక మ్యూజియంలా వుంది. వివిధరకాల సౌందర్యంగల స్త్రీల చిత్రాలు అనేక తీరులుగా చిత్రించబడివున్నాయి. దద్దుర్లెత్తిన చంద్రపాల్ మొహంలోని కారునలుపు, వాడి సూదుల్లాంటి వెంట్రుకలూ, బొద్దుముక్కు, లావు పెదవులు, అతని నొక వికార స్వరూపాన్ని కల్పించాయి. కాని, వాడి కుంచెలో ఎన్నో అందాలున్నాయి.

సాయంత్రం ఐదుగంటల సమయాన బృందావన్ పార్కులో గడ్డిమీద రోజుటిలాగే చంద్రపాల్ కూర్చొని వస్తూపోతూన్న వాళ్లని చూస్తూన్నాడు. ఒక పద్దెనిమిదేళ్ళ అమ్మాయి పల్చని మల్లుచీర కట్టుకుని, అందమైన జాకెట్టు వేసుకుని పార్కులోకి వచ్చింది. చంద్రపాల్ కళ్లు చప్పున ఆవిడమీద దాడిచేశాయి. ఆవిడ ముఖరేఖలు చంద్రపాల్‌కు అందడంలేదు సరిగా. ఆమె అతి చాకచక్యంతో మొహం తిప్పేసుకుంటూ అందంగా అడుగులు కదుపుతూ పూల మొక్కలవైపు నడుస్తూన్నది. చంద్రపాల్ తన నోటుబుక్కూ పెన్సిలూ చేతబుచ్చుకుని ఆవిడవైపు వెళ్లాడు. ఆవిడ ఇది గ్రహించినదానిలా చప్పున వెనక్కి తిరిగి మరోవేపు వెళ్ళింది. చంద్రపాల్ ఆవిడ ముఖరేఖల్ని అందుకోవడానికి చాలా ప్రయత్నించాడు. కాని, అతనికి అందలేదు. ఆమె అటునుంచి గేటులోకి వెళ్ళి తన కారులో కూర్చొంది. ఇతను కారుదగ్గరికి వెళ్లాడు. ఆమె చంద్రపాల్ ముఖంలోకి చూసింది. చంద్రపాల్ ఆమెని చూశాడు. ఆమె తనచేతి సంచిలోని కాపీపుస్తకంలో, ఏవోగీట్లు గీసేసుకుంది. చంద్రపాల్ తన నోటు బుక్కులో గీట్లు గీసుకున్నాడు.

మర్నాడుపుదయం చంద్రపాల్ నిశ్చలంగా తనగదిలో కూచుని తాను గీసిన గీతల్ని బాగా పరిశీలించి బొమ్మ రాసేడు. అంత అందమైన బొమ్మను తాను అప్పటికి యెన్నడూ రాయలేదు. కాని, తన చిత్రంమీద దృష్టి లేదు. తృప్తిలేదు. ఆవిడ ఇంతకంటే బావుంది. ముఖకళని సంపూర్ణంగా చిత్రంలోకి తెచ్చినట్టులేదు.

ఆనాటి సాయంత్రం తాను పగలు రాసిన అమ్మాయి తాలూకు చిత్రానికి ఫ్రేమ్ కట్టించడానికి బజారుకు బయలుదేరాడు. దారిలో నడుస్తుంటే ఆ అమ్మాయి తనవెంట నడుస్తూన్నట్టనిపించింది.

ఫ్రేములు కట్టే షాపులోకి వెళ్లేటప్పటికి అక్కడ తన చిత్రం వుంది. తననెవళ్లో బొమ్మ వేశారు. తన మొహంలోని దద్దుర్లనూ అనాకారాన్నీ మినహాయించి తనను రాశారు. "ఇదెవళ్ళు గీశారు?" అనడిగాడు చంద్రపాల్ ఆ ఫ్రేములు కట్టేమనిషిని. "ఒకమ్మాయి వేసింది. ఆమె ఫ్రేము కట్టమని నాకు ఇచ్చింది. ఒక గంటలో వస్తుంది" అన్నాడతను. "ఐతే ఈ చిత్రానికి ఫ్రేముకట్టి, ఆమెకు చూపించు. ఆమె అడ్రస్ ఎలాగైనా సంపాదించు" అని చెప్పి చంద్రపాల్ వెళ్ళిపోయాడు.

చంద్రపాల్ రాసిన ఆ అమ్మాయి చిత్రానికి ఫ్రేమ్‌కట్టి ఎదురుగా నుంచోబెట్టాడు ఫ్రేమ్ మనిషి. ఒక గంటలో ఆ అమ్మాయి వచ్చింది. ఆమెకు ఎదురుగా తన చిత్రం కనబడ్డది. "ఇదెవరు గీశారు?" అని అడిగింది. "ఎవరో ఒక చిత్రకారుడు గీశాడు. ఆయనపేరు నాకు తెలీదు. ఒక అరగంటలో వస్తాడు. ఐతే, తాము దయతో తమ అడ్రస్ ఇవ్వగలరా?" అన్నాడతను.

"ఓ యస్! నా అడ్రస్ కేరఫ్ చంద్రపాల్" అని చెప్పి వెళ్ళిపోయింది. చంద్రపాల్ వచ్చి, ఆమె తన కేరఫ్‌తో అడ్రస్ ఇచ్చినందుకు ఆశ్చర్యపడి ఇంటికి వెళ్ళేటప్పటికి ఆవిడ తన ఇంట్లో వుంది.

"మీ పేరు?" అన్నాడతను. "నా పేరు మిసెస్ చంద్రపాల్" అందావిడ. "నా పేరు చంద్రపాల్. నాకు పెళ్ళేఅవలేదే?" అన్నాడు చంద్రపాల్.

"మిమ్మల్ని పెళ్ళాడనిదీ మీచిత్రం ఎలా గీశాను? ఇదో మీ చిత్రం" అని ఆవిడ గీసిన చిత్రాన్ని చూపించింది. "ఇంత అందవికారిని. నన్ను మీరు ఎలా పెళ్ళిచేసుకుంటారు?" అన్నాడు చంద్రపాల్. "తమ అందమైన కళాహృదయం చూసి చేసుకుంటాను" అంది ఆవిడ.

"చంద్రపాల్ తన చేతిలోని ఆమె చిత్రాన్ని ఆమెకు సమర్పించబోయాడు."

"మీరు వేసిన నాచిత్రంలో ఇక్కడ కొంత లోపంవుంది. ఇక్కడ మరో లోపం వుంది" అని చూపించింది ఆవిడ.

"మీకు నేను శిష్యుణ్నవుతాను. నన్ను పెళ్ళిచేసుకోకండి" అన్నాడు చంద్రపాల్.

ఆవిడ అందు కంగీకరించలేదు.

చంద్రపాల్ ఇందు కంగీకరించ లేదు.